క్లుప్తంగా

రజక వృత్తిదారుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న సీఐటీయూ, రజక వృత్తిదారుల సంఘం నాయకులు

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న, జిల్లా కమిటీ సభ్యులు ఉరుకుంద, ఆదోని పట్టణ అధ్యక్షులు రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో రజక రాష్ట్ర కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని, రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ రజక సంఘం ఉపాధ్యక్షులు నాగప్ప, రవి, పట్టణ నాయకులు మల్లప్ప, పెద్ద తుంబళం మమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సయ్యద్ షహనాజ్ బేగం

ఆదోని సెంట్రల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డా.సయ్యద్ షహనాజ్ బేగం సూచించారు. హవ్వన్నపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కలుషితమైన నీరు కాకుండా సురక్షితమైన నీరుతాగే విధంగా సూచనలు అందించాలన్నారు. హైరిస్క్ కలిగిన గర్భిణుల సురక్షితమైన డెలవరీ కోసం తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. చిన్న పిల్లలు వ్యాధి బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, జ్ఞానేశ్వరి దేవి, దొరతి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలి



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని, తద్వారా ప్రణాపాయం నుంచి తప్పించుకోవచ్చని పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు శ్రీనివాస సర్కిల్‌లో హెల్మెట్ లేని ప్రయాణాలతో జరిగే ప్రమాదాలపై ప్రజలకు, వాహనదారులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు . కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాధురి, సీఆర్పీలు పాల్గొన్నారు.

దుర్గేష్‌కు గౌరవ డాక్టరేట్



ఆదోని సెంట్రల్: సాయి భారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.సి.దుర్గేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని జీఎస్‌హెచ్‌ఎస్‌టీఏ అకాడమీ అనుబంధ సంస్థలైన డే స్ప్రింగ్ థీయాలజికల్ యూనివర్సిటీ టెక్సస్ (యూఎస్ఏ) మరియు గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూయార్క్, అమెరికా సంస్థల వారు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. చిన్న వయస్సులోనే విద్యాసంస్థలను స్థాపించి విద్యారంగానికి కృషికి గుర్తింపుగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కాన్వకేషన్ కార్యక్రమంలో డాక్టరేట్‌తో సత్కరించారు.

సొంత నిధులతో పాఠశాలకు మురుగునీటి పైప్‌లైన్

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట ఉర్దూ పాఠశాలలో బాత్‌రూమ్ నుంచి మురుగు నీరు బయటకు వెళ్లకుండా అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో విదార్థినులు చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో స్పందించిన స్కూల్ కమిటీ చైర్మన్ ఇర్ఫాన్ పటేల్, వైస్ చైర్మన్ ముఖ్తార్ ఆహ్మద్ సొంత నిధులను ఖర్చుచేసి మంగళవారం మురుగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఎమ్మిగనూరు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో స్థానిక కల్లుబావి వీధికి చెందిన తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు నుంచి వస్తున్న వన్ టౌన్ సీఐ శ్రీరామ్ స్పృహ తప్పి రోడ్డుపై పడి ఉన్న తరుణ్‌ను గమనించి వెంటనే తన వాహనంలో ఎక్కించుకుని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వెంటనే ఆ యువకుడి ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

---

75 వసంతాల వేడుక..

చిరకాలం గుర్తుండేలా

- ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు సిద్ధమైన ఎమ్మిగనూరు బాలుర ఉన్నత పాఠశాల, కళాశాల
- 12వ తేదీ మహాసమ్మేళనం
- వేలాది మందికి ఆహ్వానం
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన పూర్వ విద్యార్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని వేడుకలకు ఆహ్వానిస్తున్న పూర్వ విద్యార్థులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశ ద్వారం



ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల భవన సముదాయం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏర్పాటై 77 వసంతాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల 56 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు పూర్వవిద్యార్థులు ఏర్పాట్లు చేశారు. ఈ విద్యాలయాల్లో వేలాది మంది విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరారు. వేడుకలకు నాటి నుంచి చదివిన టెన్త్, ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా గుర్తించి వారి వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందించారు. దీంతో మహాసమ్మేళనానికి వేలాదిగా తరలిరానున్నారు. అందుకు తగ్గట్టుగానే ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి ఏడాదే స్థాపితం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి ఏడాది 1948 సంవత్సరంలో ఉన్నత పాఠశాల స్థాపించగా.. ఇదే క్యాంపస్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 23-07- 1969లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ విద్యాలయాల్లో 50వేల మందికి పైగా వి ద్యాబుద్ధులు నేర్చుకున్నారు. నేడు వారు ప్రభుత్వ ఉన్నత కొలువుల్లోను, రాజకీయ రంగంలో రాణించడమే కాకుండా మరికొందరు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. మరికొందరు ఉన్నత పదవులను అలంకరించి రిటైర్డ్ అయ్యారు. ప్లాటినం జూబ్లీ మహాసమ్మేళంలో దాదాపు 2వేల నుంచి 5 వేల మందికి పైగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొననున్నారు. ఈనెల 12వ తేదీన అత్యంత వైభవంగా, చిరకాలం గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు ఆరు నెలలుగా ప్లాటినం జూబ్లీకమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు శ్రమిస్తున్నా రు. కొందరు ఆర్థికంగానూ సహకారం అందిస్తున్నారు.

చదువులమ్మ ఒడిలో ఎదిగిన ప్రముఖులు

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకున్న వారిలో లోకాయుక్తా జడ్జిగా నరసింహారెడ్డి, జిల్లా జడ్జిగా యాయా ప్రసాద్, ఆర్‌డీఓ క్యాడర్‌లో వెంకటరెడ్డి, శారదా భాగ్యరేఖ, సిద్ధలింగమూర్తి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం నాగర్ కర్నూలు డీఎస్పీగా ఆకుల భరత్‌కుమార్, డీఎస్పీగా పనిచేసి రిటైర్ అయిన నాగన్న, ఏపీ విద్యుత్ బోర్డ్ డైరెక్టర్ పని చేసి రిటైర్ అయిన పుల్లారెడ్డితో పాటు ప్రముఖ వైద్యులు గౌడప్ప గౌడ్, శ్రీనివాసులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మాచాని రఘునాథ్, ఎంఆర్ గంగాధర్, ఎంఆర్ రమేష్ ఈ విద్యాలయంలోని చుదువుకున్నారు. అలాగే రాజకీయంగా రుద్రగౌడ్, తిక్కారెడ్డి, సాంస్కృతిక సేవారంగంలో రాష్ట్ర,జాతీయ స్థాయిలో నాటక రంగాల్లో అవార్డులు పొందిన మహమ్మద్‌మియా, రాజారత్నం, బైలుప్పల షఫీవుల్లాతో పాటు ఎందరో హైకోర్టు న్యాయవాదులుగాను, ఎంపీడీఓలు, తహసీల్దార్లుగాను, ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలుగాను, నీటిపారుదల, విద్యుత్ శాఖ, విద్యారంగం, రవాణాశాఖ, కార్మిక, పశుసంవర్ధక, పోలీసు, ఇలా ఎన్నో రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

కమిటీ ఏర్పాటు

ప్లాటీనం జూబ్లీ వేడుకలు చిరకాలం గుర్తుండిపోయేలా ఆరు నెలల క్రితమే పూర్వ విద్యార్థులు ఎం హరినారాయణరెడ్డి, ఎంసీ శివకుమార్, ఎస్.మల్లికార్జున, బైలుప్పల షఫీవుల్లా, ప్రకాష్‌జైన్, మాచాని వెంకటేష్, కామలే గణేష్, ఈరన్న గౌడ్, ఎస్.జబీర్ బాషాలతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఏర్పాట్లు చేసేందుకు పలు విభాగాలకు కమిటీలను ఏర్పాటు చేసి పనులు చేపట్టారు.

కార్యక్రమాలు ఇలా..

12వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆ రోజు ఉదయం పట్టణంలోని శివ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, సోమప్ప సర్కిల్ మీదుగా ప్రభుత్వ బాలుర హైస్కూల్ వరకు పూర్వ, ప్రస్తుత విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం మహాసమ్మేళన ప్రారంభోపన్యాసంతో పాటు తమకు చదువులు నేర్పిన గురువులకు ఘన సన్మానం చేయబోతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈసమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధుల ప్రసంగాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఆనందంగా ఉంది



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేను 1970-72 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదువుకున్నా. ఎంఆర్ఓగా పని చేసి రిటైర్డ్ అయ్యా. నేను చదువుకున్న కళాశాల క్యాంపస్‌లో వున్న పాఠశాల 75 వసంతాలు, జూనియర్ కళాశాల 56ఏళ్లు పూర్తి చేసుకొని వేడుకలు నిర్వహించుకొంటున్నారంటే ఎంతో ఆనందంగా ఉంది.

– అజయ్‌కుమార్, రిటైర్ తహసీల్దార్

ఏర్పాట్లు చేస్తున్నాం



ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వహణకుగాను ఉత్సవ కమిటీ సభ్యులంతా ఐక్యతతో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకలకు పాఠశాల, కళాశాల మైదానంలో వేదిక ఏర్పాటు చేస్తున్నాం. 1948 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చదువుకున్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఈ వేడుకలకు హాజరవుతున్నారు.

– బైలుప్పల షఫీవుల్లా, పూర్వ విద్యార్థి, ఎమ్మిగనూరు

గుర్తుండిపోయేలా వేడుకలు



పాఠశాల, కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలను చిరకాలం గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులందరం కృషి చేస్తున్నాం. 75 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించడం మాకు ఎంతో గర్వంగా ఉంది. ప్రతి ఒక్క పూర్వ విద్యార్థిని ఆహ్వానిస్తున్నాం. పూర్వ విద్యార్థులైన ఉద్యోగులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఇలా చదువుల తల్లి ఒడిలో చదువుకున్న ప్రతి ఒక్కరూ వచ్చేలా కృషి చేస్తున్నాం.

– ఎంసీ శివకుమార్, ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యుడు

ఎలాంటి ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు



ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 75 సంవత్సరాల తరువాత అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు కలవబోతున్నారు. చాలా మంది పూర్వ విద్యార్థులు ప్రతి రోజు వేడుకలకు వచ్చేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఈ వేడుకలు సంక్రాంతి సెలవుల్లో ఏర్పాటు చేస్తుండటంతో ఎక్కువ మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యే అవకాశం వుంది.

–మాచాని వెంకటేష్, ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యుడు

భూ సమస్యల పరిష్కారానికి కృషి



కోసిగి రెవెన్యూ సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి: గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ రకాల భూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ నిత్యానందరాజు అన్నారు. మంగళవారం కోసిగిలోని సచివాలయం-4 ఆవరణలో కోసిగి, పెండెకల్లు రెవెన్యూ గ్రామాల రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో కోసిగి పరిధిలో 13, పెండేకల్లు పరిధిలో 6 దరఖాస్తులు వచినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు రైతులకు పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బుధవారం వందగల్లు గ్రామంలో రెవెన్యూ సదస్సు ఉంటుందని తెలిపారు. సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ శ్రీరాములు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మంత్రాలయం : మంత్రాలమం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ గ్రామ పరిధిలోని భూ సమస్యల పై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. వీఆర్వోలు ప్రభాకర్, ఆనంద్,సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ అవినీతిపై విచారణ చేపట్టాలి



ట్రైనీ కలెక్టర్ కళ్యాణికి వినతి అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గుప్త అవినీతిపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్రబాబు, విజేంద్ర, ఉదయ్, వీరేష్ యాదవ్, సరేంద్రబాబు, ఉసేన్‌లు కోరారు. మంగళవారం బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో లైంగిక వేధింపుల సంఘటనపై విచారణకు వచ్చిన ట్రైనీ కలెక్టర్ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకొని ఏ సమస్యను బయటకు రాకుండా చేశాడని ఆరోపించారు. కాలేజీకి వచ్చిన నిధులు ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేశాడని, విచారణ చేపడితే నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని కఠనంగా శిక్షించాలని కోరారు.

ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం నివారించాలి

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం నివారించాలని సీఐటీయూ మండలాధ్యక్షులు రామాంజనేయులు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలోని పాండవగల్ గ్రామంలో సుమారు 300 మందికి పైగా కూలీలకు ప్రతిరోజూ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మ ఆధ్వర్యంలో ఉపాధి పనులు కల్పిస్తున్నారన్నారు. కానీ కొంత మంది ఉద్దేశ పూర్వకంగానే మాకు ప్రత్యేకంగా మస్టర్ కావాలని రాజకీయంగా ఎంపీడీఓపై ఒత్తిడి తీసుకురావడంతో 120 మంది పని చేస్తున్న వర్క్ ఐడీ నంబర్ వారికి కేటాయించారన్నారు. దీంతో పనులు లేకుండా పోయాయన్నారు. గత వారంలో చేసిన వర్క్ ఐడీని వేరే వాళ్లకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇన్‌చార్జి ఏపీఓ సూర్యప్రకాష్ మాట్లాడుతూ వర్క్ ఐడీలో ఎవరికి పని కల్పించమని, వచ్చే వారంలో అందరికీ పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాండురంగ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గోవిందు, కృష్ణ, హుసేని తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై విచారణ



నందవరంలో పింఛన్లపై విచారణ చేస్తున్న డాక్టర్లు, అధికారులు

నందవరం : మండలంలోని డయాలసిస్, పక్షవాతం పింఛన్లు, డీఎంహెచ్ఎం పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను సర్వే బృందం డాక్టర్లు విచారణ చేపట్టారు. ఈ వ్యాధిగ్రస్తులకు నెల రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు అందుతుంది. మంగళవారం ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి మండలంలోని గురజాల, రాయచోటి, నందవరం, ముగతి, కనకవీడు, మాచాపురం, హాలహర్వి గ్రామాల్లో నందవరం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ, సర్వే బృందం డాక్టర్లు ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ డాక్టర్లు శ్రీకాంతరెడ్డి, కళ్యాణ్ విచారించారు. మండలంలో ఆయా పింఛన్లు పొందు తున్న లబ్ధిదారులు 15 మంది ఉన్నారని ఈఓపీఆర్డీ తెలిపారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు

ప్రజలు సహకరించాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని డ్రైనేజీ పూడికతీత పనులకు ప్రజలు సహకరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు కోరారు. మూడు రోజులుగా గ్రామంలో చేపట్టిన పూడికతీత పనులను వారు మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. కొంతమంది ప్రజలు తమ ఇంటికి ముందు డ్రైనేజీపై వేసుకున్న బండలను తొలగించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న బండలను తొలగిస్తే డ్రైనేజీని శుభ్రం చేయడానికి వీలు పడుతుందని చెప్పారు.

రేపు సద్గురు భంభం స్వామి ఆరాధన

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులోని కల్లుబావి వీధిలో వెలసిన శ్రీ సద్గురు భంభం స్వాముల వారి ఆశ్రమం 89వ వార్షికోత్సవం సందర్భంగా భంభంస్వామి ఆరాధనోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి అఖండ భజనలతో ప్రారంభమవుతుందని, గురువారం తెల్లవారుజామున 4 గంటలకు జెండా కార్యక్రమం, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

గోనెగండ్ల : విద్యారంగంపై ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఈనెల 11న విజయవాడలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని హెచ్. కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జీఓ 117 పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయులపై మోపుతున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కృషి

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తుంగభద్ర పాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్ అన్నారు. మంగళవారం కామవరం హెడ్ రెగులేటర్ వద్ద ఏర్పాటు చేసిన సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈ మహమ్మద్ సైఫుల్లా మాట్లాడుతూ.. ఈ ఏడాది తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉండడంతో మార్చి చివరి నాటికి సాగునీరు అందించేందుకు ఇప్పటికే ప్రణాళిక తయారు చేశామన్నారు. దానికి అనుగుణంగానే సాగునీరు వస్తాయని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమావేశంలో మండలంలోని సాగునీటి సంఘాల అధ్యక్షుడు, ఏఈ ఈశ్వర్, తెలుగుదేశం నేతలు పాల్గొన్నారు.

కాలువ విషయంలో ఘర్షణ

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం తంగరడోణ గ్రామంలో స్థలం, కాలువ విషయంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అందులో మారెప్ప, లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

మారెమ్మ దేవర ప్రారంభం



భక్తుల మధ్య ఊరేగింపుగా వెళ్తున్న సిద్ధప్ప పాళెం మారెమ్మ దేవి

కోసిగి: గ్రామ దేవత మారెమ్మ దేవి దేవర ఉత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. కోసిగిలోని చింతలగేని, కడపాళెం, సిద్దప్ప పాళెం కాలనీలలోని ఆలయాల్లో గ్రామ పెద్దలు, దొరల వంశస్తులు, మేటి గొల్ల సమక్షంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. చింతలగేని మారెమ్మ దేవి కాళికాదేవి ఆలయం నుంచి సిద్దప్పపాళెంలో దొరల చావిడి మీదుగా కడపాళెం, కొండుగాని వీధుల్లో మారెమ్మ దేవి విగ్రహాలను రథాలపై కొలువుంచి ఊరేగించి తిరిగి ఆలయాలకు చేర్చారు. అక్కడ అమ్మవార్లను యథా స్థానంలో ప్రతిష్ఠించి విశేష పూజలు చేపట్టారు. అలాగే నాడుగేని వీధి, రంగప్పగట్టు, శాంతినగర్ కాలనీ కొలువుతీరి ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలు కొలువుంచి విశేష పూజలు చేపట్టారు. ఐదేళ్ల తర్వాత దేవర ఉత్సవాలు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సిద్దప్ప పాళెం మారెమ్మ దేవి ఆలయం వద్ద భక్తుల సందడి

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ సఫరున్నిసా బేగం

ఎమ్మిగనూరుటౌన్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నీసా బేగం, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏపీ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ లింగ వివక్షను, గర్భస్థ లింగ నిర్ధారణ పద్ధతులను వ్యతిరేకించాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించాలని సూచించారు. అనంతరం మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజినేయులు, డీసీపీఓ శారద పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

8న ముగ్గుల పోటీలు

ఆదోని అర్బన్: అవోపా, వామ్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు అవోపా మరియు వామ్ అధ్యక్షులు పగదారి శ్రీనాథ్‌గుప్తా మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గట్టు మల్లయ్యశెట్టి ప్రభుత్వ బాలికల పాఠశాల (ఎస్‌కేడీ కాలేజ్)లో పోటీలు ఉంటాయన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చన్నారు. పేర్ల నమోదు కోసం 98494 78178 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



పూజారులకు కొత్త వస్త్రాలను అందజేస్తున్న కాలనీవాసులు,



పూజలందుకున్న వీరాంజనేయస్వామి



పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా 41వ రోజు పూజలు

ఆదోని రూరల్: పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసి 41 రోజులు కావడంతో మంగళవారం వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీమన్నారాయణ రామానుజ వేదాంతం పుండరీకాక్షచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 6.30 గంటలకు విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ద్వాదశ కలశారాధన, పంచామృతాభిషేకం, స్వపన తిరుమంజనం చేపట్టారు. ఉదయం 10.30 గంటల నుంచి సుదర్శనహోమం, మహాపూర్ణాహుతి, మహామంగలహారతి, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజలు గావించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామికి పూజా కార్యక్రమాలు చేసిన పూజారులకు నూతన వస్త్రాలను కాలనీవాసులు అందజేశారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.